# మూడు-ఆరు



వసుంధర

రంగారావుకి జేబులో ఎప్పుడూ కత్తి వుంటుంది. అలాగని అతడు దొంగ, హంతకుడు కాదు. ఆ కత్తిని సుబ్బరాజు కోసం అతడు ప్రత్యేకించాడు.

రంగారావుకి పదేళ్ళ వయసప్పుడు సుబ్బరాజు రంగారావు తండ్రి చలపతిని రక్తం వచ్చేలా కొట్టి పనిలోంచి తీసేశాడు. చలపతిది పద్దులు రాసే వుద్యోగం. తప్పుడు లెక్కలు రాసి డబ్బు కాజేశాడని సుబ్బరాజు అనుమానం.

చలపతి సుబ్బరాజు కొట్టినందుకు కాక పని పోయినందుకు ఏడ్చాడు. ప్రతీకారంతో కాక అవసరార్థం కష్టపడి పరిశోధించి పద్దు పుస్తకంలో తప్పుడు లెక్కలు రాసి యిరికించినాడు సుబ్బరాజు బావమరిదేనని రుజువు చేశాడు.

సుబ్బరాజు బావమరిది మళ్ళీ అలాంటి పని చేయొద్దని మందలించి చలపతిని మళ్ళీ పనిలోకి తీసుకున్నాడు.

ఒకే తప్పుకు ఒకే మనిషి ఇద్దరు వ్యక్తులకు వేర్వేరుగా శిక్షలు విధించడం రంగారావు కళ్ళారా చూశాడు. తండ్రి దగ్గర ఆవేశంతో మండి పడ్డాడు. చలపతి వాణ్ణి సముదాయించి, 'మనకు మంచి జరిగితే సంతోషించాలి. చెడు జరిగితే సహించాలి. ఇదే సమాజన్యాయం' అన్నాడు.

"ఎందుకని?" అన్నాడు రంగారావు.

"మనం శక్తిహీనులం" అన్నాడు చలపతి.

ఈ మాటల్ని రంగారావు తప్పుగా అర్థం చేసుకున్నాడు. వాడు చిన్నప్పట్నించీ చదువు శ్రద్ధ మాని కండలు పెంచడం మొదలెట్టి అల్లరి చిల్లరిగా తిరగసాగాడు. వాడి వల్ల ప్రయోజనం ముందనుకునేవారు వాడి చేత అల్లరి పనులు చేయించి ప్రయోజనం పొందేవారు. వాడికి తగిన ప్రోత్సాహాన్నిస్తూ అండగా వుండేవారు.

ఆ విధంగా సినిమాథియేటర్ల వద్ద బ్లాకులో టిక్కెట్లు అమ్మడం లాంటి ప్రజామోదం పొందిన నేరాలు చేస్తూం డేవాడు రంగారావు. ప్రతి నెలా వాడి సంపాదనే ఎక్కువగా వుండేది. చలపతి దీనికి సంతోషించక ఒక్కగానొక్క కొడుకు చెడిపోతున్నాడని బాధ పడే వాడు.

రంగారావు తండ్రితో, "ఒక్కసారి సుబ్బరాజును రక్తం వచ్చేలా కొట్టాలనుంది. నువ్వేందు కొప్పుకుంటే ఆ తర్వాత మంచి బుద్ధిగా వుంటాను" అన్నాడు.

చలపతి అందుకొప్పుకోలేదు. కదా!

రంగారావు మాటలన్నప్పుడు వాడి వయసు పదిహేను!

ఆరోజే వాడో కత్తి కొన్నాడు. తల్లి వాడి జేబులో కత్తి చూసి, "అదెందుకురా?" అని భయంగా అడిగితే—

"నాన్న మాటలు నా ఆవేశాన్ని చంపుతున్నాయి. ఆయన్ను బాధ పెట్టలేక నేను సుబ్బరాజును కొట్టడం లేదు. కానీ ఏదో ఒక రోజున నా ఆవేశం బద్దలవుతుంది. అప్పుడు నేను సుబ్బరాజును కొడతాను. కానీ వాడి ఒళ్ళంతా కొవ్వుపట్టి వుంది. ఎన్ని కొట్టినా ఆ కొవ్వును చీల్చుకుని రక్తం బైటకు రాదు. మనిషిని కొట్టక ఎంతో కొంత రక్తం కళ్ళ చూడాలి. అందుకే ఈ కత్తి!" అన్నాడు రంగారావు.

"దెబ్బతిన్న నాన్నకు లేని పగ నీ కెందుకురా?" అంది తల్లి భయంగా, బాధగా.

"దెబ్బకు దెబ్బ ఏదో రోజున తగుల్తుందని సుబ్బరాజు లాంటివాళ్ళకు తెలియక పోతే ...ఎలా?" అన్నాడు రంగారావు ఆవేశంగా.

అప్పట్నించి వాడావేశపడుతూనే వున్నాడు కానీ అది బద్దలవడం లేదు. అలాంటి రోజు రెండేళ్ళ తర్వాత వచ్చింది.

ఆరోజు సుబ్బరాజు దుకాణం ముందు జనం గుమికూడి వున్నారు. రంగారావు జనాన్ని తప్పించుకుని ముందుకు వెడితే—

సుబ్బరాజు ఓ కుర్రాణ్ణి గొడ్డును బాదినట్లు బాదుతున్నాడు.


"ఏమిటీ అత్యాచారం;" అన్నాడు రంగారావు.

జనం వులిక్కి పడ్డారు. సుబ్బరాజు వులిక్కి పడ్డాడు.

"నువ్వు మనిషివా, పశువ్వా;" మళ్ళీ అన్నాడు రంగారావు.

సుబ్బరాజు రంగారావుని గుర్తుపట్టి," ఏం జరిగిందో తెలుసు కోకుండా మాటలు విసరకు. వీడి మీద నమ్మకముంచి గల్లాపెట్టె అప్పగిస్తే పది రూపాయిలు కొట్టేశాడు....ఈ రోజు పదయింది. రేపు వందవుతుంది... ఒక్క సారి బుద్ధిచెప్పకపోతే..."అంటూండగా మళ్ళీ ఆవేశం వచ్చి భుజం మీద పని వాణ్ణి పిడి గుద్దు గుద్దాడు.

"ఒక వేళ పది రూపాయిలు వాడు తీయలేదని రుజువైందనుకో అప్పుడు నువ్వు మళ్ళీ అమాయకులను కొట్టకుండా గుర్తుండేలా నీకే శిక్ష విధించాలి?" అన్నాడు



రంగారావు.

చుట్టూచేరి చోద్యం చూస్తున్నవాళ్ళలో ఒకడు, "ఎవరివయ్యా నువ్వు, దొంగ వెధవల్ని సపోర్టు చేస్తావు" అన్నాడు.

రంగారావు జనాన్నుద్దేశించి, "అయ్యా! మీరు చోద్యం చూడ్డాని కొచ్చారు. అలా చూస్తూ నిలబడండి. సాటి మనిషి హింసకు గురవుతూంటే కలగ జేసుకునే కొత్త అలవాటు మీరు చేసుకోకండి..."

అని సుబ్బరాజుతో, "నీ గల్లా పెట్టెలో పది రూపాయిలు మాయమయ్యాయి. ఈ కుర్రాణ్ణి నువ్వు నమ్మనంటు న్నావు కదా! అలాగే ఈ కుర్రాడు నన్ను నమ్మి ఓ గంటలో ఇచ్చేస్తానంటే పది రూపాయిలు అప్పుగా నాకిచ్చాడు. అని తిరిగి ఇవ్వడానికే వచ్చాను...." అంటూ పది రూపాయిల నోటు తిరిగి ఇచ్చి సుబ్బరాజుని సాచి లెంపకాయ కొట్టాడు.

ఆ తర్వాత అంత మంది జనం చూస్తుండగా రంగారావు సుబ్బరాజుని చావ గొట్టాడు. కండలు తిరిగిన బలిష్టమైన వాడి శరీరం చూసి చాలా మంది వాణ్ణాప డానికి భయ పడ్డారు.

కసితీరా సుబ్బరాజుని కొట్టేక, "ఇంత కొట్టినా బట్టలు చిరిగాయి తప్ప వళ్ళు నలగ లేదు నీకు. నీ కొవ్వు నీల్చుకుని రక్తం బైటకు చిమ్మేలా చేస్తానుండు" అంటూ రంగారావు జేబులోంచి కత్తి తీశాడు.

చుట్టూ వున్న జనం నివ్వెర పోయారు. సుబ్బరాజు రక్షించండి అని అరవడానికి బదులు, "నన్నేం చేయకు" అని రంగారావుని వేడుకున్నాడు.

"నీ చెయ్యి అమాయకుడ్ని కొట్టడానికి లేస్తోందో దాన్ని శాశ్వతంగా చచ్చు పడేలా చేస్తాను" అంటూ రంగారావు చేతిమీద గట్టిగా పొడిచాడు.

రక్తం చివ్వున చిమ్మింది.

వాడింకా ఎన్ని పోట్లు పొడిచాడో కాని విషయం తెలిసి ఎక్కడో పద్దులు రాస్తున్న చలపతి అక్కడికి పరుగున వచ్చి అడ్డుపడి సుబ్బరాజుని రక్షించాడు.

"దెబ్బతిన్నవాళ్ళు నిన్ను క్షమించి రక్షించవచ్చు. కాని వాళ్ళ బిడ్డలు సహించరు. నీ అక్రమాలు తరతరాలు కొనసాగవు. గుర్తుంచుకో" అంటూ రంగారావక్క ణ్ణుంచి నిష్క్రమించాడు.

* * * * * *

రంగారావు కటకటాల వెనుక వున్నాడు.

కటకటాల కివతల రంగారావు తల్లి దండ్రులు కన్నీళ్ళతో వాణ్ణే చూస్తున్నారు.

"మొత్తం మీద జైల్లో అడుగు పెట్టావు. ఇదింతటితో ఆగుతుందను కోను..." అన్నాడు చలపతి.

"మూడు నెలలేగా!" అన్నాడు రంగారావు నిర్ల క్ష్యంగా.

"జైలు కెళ్ళడం అవమానంగా లేదురా నీకు!" అంది తల్లి.

"నేను చేసిన నేరానికి అయిదేళ్ళ శిక్ష పడాల్సింది. కాని నా శ్రేయోభిలాషులు గలగ జేసుకొని మూణ్ణెల్లకు తగ్గించారు. ఇందుకు నేను గర్వ పడాలి..." అన్నాడు రంగారావు.

"నీ శ్రేయాభిలాషులు మంచి వాళ్ళు కారు. ననా జాతికే చీడపురుగులు...

"నాన్నా! దెబ్బలు తింటూ చీడ పురుగుల్ని నువ్వు సహిస్తున్నావు. దెబ్బ తీయడానికి చీడ పురుగుల్ని నేను సహిస్తాను. చీడ పురుగుల్ని సహించడం తప్పనప్పుడు నాకు నీ పద్ధతి కంటే నా పద్ధతే మేలనిపిస్తుంది...


"నీ పద్ధతిలో ఏం సాధించావురా? ఆ సుబ్బరాజు కేం సుఖంగా వున్నాడు. నువ్వే జైలు పాలయ్యావు... ఏడ్చింది తల్లి.


"సుబ్బరాజుని ఎముకలు విరిగేలా కొట్టాను. రక్తం వచ్చేలా పొడిచాను. సుఖంగా ఎలా వుంటాడు? వాణ్ణే హాస్పిటల్లో చేర్చలేదా?" అన్నాడు రంగారావు.

"చేర్చారు. తుంటి ఎముక విరిగింది. ఆర్నెల్లు హాస్పిటల్లో బెడ్‌మీద వుండాలిట...!" అన్నాడు చలపతి.

"చూశావా అమ్మా! నేను జెయిల్లో వుండేది మూణ్ణెల్లే! కాని ఆ సుబ్బరాజు హాస్పిటల్లో వుండేది ఆర్నెల్లు... నేనేం సాధించ లేదంటా నేమిటి?" అన్నాడు రంగారావు ఉత్సాహంగా.

చలపతి, భార్యా ఆనాక్కా వాడి వంకే చూస్తూండి పోయారు. వాడు జైలు నుంచి తిరిగి రాకుండా వుంటే బాగుణ్ణు అనుకున్నారు.



# మాయ మనసు

వారం రోజుల బట్టి లేవడం లేదు గోపాలరావు. అతని ముప్పై ఏళ్ళ వయసులో ఇలా అస్వస్థత పాలై, మూలుగుతూ పడకవేయడం ఇదే ప్రథమం. పేపర్ చదివే ఓపికలేదు. నిలబడితే చాలు నీరసంతో కళ్ళు గిర్రున తిరిగి, చీకట్లు కమ్మేని. కడుపులోకి ఏమీ పోవడం లేదసలు.

వైద్యుడి ప్రావీణ్యత గురించి అనుమానం అనవసరం. రక్తపరీక్ష, మూత్ర పరీక్ష... వగైరాలతో, రోగాన్ని 'డయాగ్నైజ్' చెయ్యడానికి కుస్తీ పడు తున్నాడు.

ఎప్పుడు అమితోత్సాహంతో-పిడిరాయిలా వుండే తనకీ దుస్థితి దాపురించిందేమిటి...?

ఈ పరీక్షేమిటి తనకి? ఈ వెధవ యాతన కంటే ఒక్కసారి ప్రాణం పోతే ఎంత హాయి!?

అనారోగ్యం కలిగించిన వైరాగ్యం అది.

** ** ** **

వారం తర్వాత...

గోపాలరావు మళ్లీ మునుపటి మనిషి... కాదు, కాదు, రెట్టించిన ఉత్సాహం, ద్విగుణీకృతమైన చలాకీ తనంతో తుళ్ళిపడుతున్నాడు.

'కొలీగ్' రాఘవరావుకి ప్రమోషన్ రావడంతో ఆ 'అకేషన్ని' 'బాంబె బార్'లో ఘనంగా జరుపుకుంటు న్నారు.

గోపాలరావు ఎంతో ఇష్టంగా 'బీర్' సిప్ చేస్తూ, ఎర్రటి చికెన్ వేపుడు ఆత్రంగా తినేస్తూ- 'సెక్సీ' జోకులతో మిత్ర బృందాన్ని అలరిస్తున్నాడు.

'ఈ జీవితం దేవుడిచ్చిన వరం, బ్రదర్స్! ప్రతి క్షణాన్ని సద్వినియోగపర్చుకుంటూ... ఆనందాలు జుర్రుకుని, సుఖాల్ని పిండుకోవాలి.

దేవుడు నన్ను వరం కోరుకొమ్మంటే- వెయ్యేళ్ళ ఆయుర్దాన్ని కోరుకుంటాను...' అంటూ గడ, గడా మాట్లాడేస్తుంటే- అతనిలోని 'మాయమనసు' నిస్సిగ్గా... అని జారిపడ్తోంది.

అవధానుల సుధాకరరావు